క్లుప్తంగా

## స్థలం ఆక్రమణపై ఫిర్యాదు


నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

**దక్కిలి:** మండలంలోని వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని మోపూరు క్రాస్ రోడ్డులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన మందిర స్థలం ఆక్రమణపై స్థానికులు ఫిర్యాదు చేశారు. గత ఏడాది నుంచి తమిళనాడుకు చెందిన కొందరు వ్యక్తులు దురాక్రమణ చేస్తూ ఉంటే రెవెన్యూ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ గద్దల మునెయ్య ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో జేసీకి వినతి పత్రం అందజేశారు. అంబేద్కర్ విజ్ఞాన మందిర్ స్థల అక్రమణను తొలగించి విజ్ఞాన మందిరానికి కేటాయించాలని తెలిపారు.

## పోలిరెడ్డిపాళెంలో వైద్య శిబిరం


శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

**దొరవారిసత్రం :** మండలంలోని పోలిరెడ్డిపాళెం సచివాలయం వద్ద మంగళవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. చిన్న పిల్లలకు టీకాలు వేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య బీపీ, షుగర్ వంటి పరీక్షించడంతోపాటు క్యాన్సర్, తల్లి బిడ్డా, పోషణ, వయోవృద్ధుల పరీక్షలు, కిశోర బాలికల ఆరోగ్య పరీక్షలు, మానసిక వైద్య పరీక్షలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ అధికారులు తల్లిపాలు, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు.

## మొక్కలు పెంచడంలో ప్రత్యేక శ్రద్ధ


మొక్క నాటుతున్న కమిషనర్ ఫజులుల్లా

**నాయుడుపేటటౌన్:** ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా సూచించారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల ఆవరణలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

## ప్రభుత్వ ఆస్పత్రికి బెడ్, వీల్‌చైర్ అందజేత


దాతలు అందించిన బెడ్, వీల్ చైర్‌లు

**నాయుడుపేటటౌన్:** స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి సుమారు రూ.50 వేలు విలువ చేసే బెడ్, వీల్‌చైర్‌లను దాతలు సోమవారం అందజేశారు. దివంగత వైఎస్సార్ సీపీ నేత చిల్లకూరు సుబ్రహ్మణ్యం రెడ్డి(అబ్బాయి రెడ్డి) జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు చిల్లకూరు బాలకృష్ణా రెడ్డి, సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు వీటిని వితరణ చేశారు. వీటిని ఆస్పత్రి సూపరింటెండెంట్ అమరనాథ్‌కు అందజేశారు.

## ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం


ప్రభుత్వ వైద్యశాల వద్ద నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

**నాయుడుపేట టౌన్:** స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు యువత పాల్గొని రక్తదానం చేశారు. గూడూరు ఏరియా వైద్యశాలకు చెందిన బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు రక్తదాతలకు గుర్తింపు పత్రాలను అందించారు.

## కండలేరులో 51.712టీఎంసీల నీరు

**రాపూరు:** కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 51.712టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,000క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 370, పిన్నేరుకాలువకు 100, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

**చికెన్ ధరలు** 23-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | | |
|---|---|---|
| బ్రాయిలర్ లైవ్ | : | 128 |
| లేయర్ లైవ్ | : | 110 |
| బ్రాయిలర్ చికెన్ | : | 230 |
| బ్రాయిలర్ స్కిన్ లెస్ | : | 256 |
| లేయర్ చికెన్ | : | 187 |

# శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**సూళ్లూరుపేట:** దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అమ్మవారి ఆలయాల్లో సోమవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం అమ్మవారి ఎదుట కలశ స్థాపన చేసి, అఖండ జ్యోతిని వెలిగించారు. చెంగాళమ్మ తల్లికి పుట్టినిల్లు అయిన గొల్లలములువు గ్రామం నుంచి సారెను తీసుకొచ్చి సమర్పించారు. యాగశాలలో మహా చండీయాగం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు పరమేశ్వరి అలంకారంతో దర్శనమిచ్చారు. ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్న పథకానికి నెల్లూరుకు చెందిన బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి రూ.50 వేలు నగదు విరాళంగా అందించారు.

**సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి**

**రాపూరు:** మండలంలోని పెంచలకోనలో ఉన్న ఆదిలక్ష్మీ దేవి అమ్మవారు సోమవారం సౌభాగ్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 9 గంటలకు దర్బారు సేవ సాగింది. కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనిమిచ్చారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**సౌభాగ్యలక్ష్మిగా ఆదిలక్ష్మి**

**చిల్లకూరు:** మండలంలోని కలవకొండ గ్రామంలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మి అమ్మవారు సౌభాగ్యలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

**శ్రీబాల త్రిపుర సుందరీదేవీగా**

**సైదాపురం:** మండల కేంద్రంలోని శ్రీబాల త్రిపుర సుందరీదేవీ ఆలయంలో అమ్మవారు అదే అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీచక్రానికి పన్నీరు అభిషేకం చేశారు. అమ్మవారికి నక్షత్ర హారతి ఇచ్చారు. అమ్మవారి భక్తులు కొందరు భవానీ మాలను ధరించారు. చెరువు సమీపంలో ఉన్న గంగమ్మ, పోలేరమ్మ తల్లి ఆలయాల్లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు.


నాయుడుపేట: షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న చండీయాగం

**కుంకుమార్చన**

**వాకాడు:** దసరా ఉత్సవాలను పురస్కరించుకుని సిద్ధిగుంటపాళెంలో ఉన్న చతుర్భుజ మహాలక్ష్మీ అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకారం నిర్వహించారు.

**రాజరాజేశ్వరిగా ముత్యాలమ్మ**

**చిల్లకూరు:** తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ రాజరాజేశ్వరిఅలంకారంలో భక్తులను కటాక్షించారు.

**పార్వతీ అలంకారంలో..**

**సూళ్లూరుపేట రూరల్ :** పట్టణంలోని గంగా పార్వతీ త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు పార్వతీ అలంకారంలో భక్తులకు దర్శనిమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అదే అలంకారంలో దర్శనమిచ్చారు.

**విశేష రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు..**

**వెంకటగిరి రూరల్:** పట్టణంలోని శ్రీ హరిహర క్షేత్రంలో కాత్యాయని అమ్మవారు అర్ధనారీశ్వరిగా, కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు స్వర్ణకవచ అలంకారంలో, వెలమపాళెంలోఉన్న దేవి మంద నాంచారేశ్వరి దేవస్థానంలో అమ్మవారు పార్వతి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.

**పార్వతీదేవిగా పోలేరమ్మ**

**నాయుడుపేటటౌన్ :** గ్రామ దేవత పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు పార్వతీ దేవి అలంకరణలో అభయమిచ్చారు. స్వర్ణముఖి నది ఒడ్డునఉన్న దుర్గామల్లేశ్వరి దేవీబాలాత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు.

**బాలాత్రిపుర సుందరిగా కోటమ్మ**


**కోట:** గ్రామదేవత కోటమ్మ దేవస్థానంలో అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

**బాలా త్రిపుర సుందరిగా రాజరాజేశ్వరి**

**గూడూరురూరల్ :** పట్టణంలోని శ్రీరాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరిగా, బజారువీధిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి రాజరాజేశ్వరిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారు లక్ష్మీ దేవిగా, దిగువ వీరారెడ్డిపల్లి శ్రీ మహాలక్ష్మమ్మ పార్వతిగా భక్తులను కటాక్షించారు.

**చిట్టమూరు:** మల్లాంలోని శ్రీ కామాక్షీదేవి సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.


రాపూరు-: బాలా త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి


సూళ్లూరుపేట: పరమేశ్వరిగా చెంగాళమ్మ


రాపూరు: సౌభాగ్య లక్ష్మిగా ఆదిలక్ష్మి


సూళ్లూరుపేట: వాసవీ కన్యకా పరమేశ్వరిగా..


రాపూరు-కలశ ఊరేగింపులో ఆర్యవైశ్యులు


చిట్టమూరులో.., వెంకటగిరి: పార్వతిగా.., చిల్లకూరులో ఆదిలక్ష్మి, నాయుడుపేట, సూళ్లూరుపేటలో పార్వతీదేవిగా, మూకాంబికా దేవి, బాలా త్రిపుర సుందరి, గూడూరు: శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో. .

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**సూళ్లూరుపేట :** పట్టణంలోని శ్రీచెంగాళమ్మ ఆలయం సమీపంలో ఉన్న 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ టౌన్ ఫీడర్ కింద మంగళవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మోహిని తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైనందున విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు కటింగ్ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ కారణంగా శ్రీనగర్‌కాలనీ, బజారువీదధి, పార్కు వీధి, కచేరివీధి, పరమేశ్వరనగర్, బ్రాహ్మణవీధి ప్రాంతాల్లో విద్యుత్ వుండదని తెలిపారు.

## 23న జాబ్‌మేళా

**సూళ్లూరుపేట:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు జేకేసీ వారి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎల్‌బీ శంకరశర్మ తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రముఖ కంపెనీ అయిన టీవీఎస్ ఇండియోన్ లిమిటెడ్ వారి ప్రతినిధుల సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 28 ఏళ్ల వయసు వారు అర్హులని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యేవారు దరఖాస్తు ఫారం, ఆధార్‌కార్డు, మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.

## జీఎస్టీ రద్దుపై వేడుకలు

**నాయుడుపేటటౌన్:** పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో సోమవారం జీఎస్‌టీ తగ్గింపుపై వేడుకలు నిర్వహించారు. సీనియర్ బ్రాంచి మేనేజర్ ఎం సుధీర్ సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో లియాఫీ బ్రాంచి ప్రెసిడెంట్ బాల గురునాథం, కే మాల్యాద్రి నాయుడు పాల్గొన్నారు.

## పోషకాహారంతో ఆరోగ్యం

**చిల్లకూరు:** సరైన పోషకాహారం తీసుకున్న వారు ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక సూచించారు. మండలంలోని తిప్పగుంటపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 8వ పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే కోడి గుడ్లు, పాలు, పోషకాహారాన్ని క్రమం తప్పక తీసుకోవాలన్నారు.

## క్షయ వ్యాధి నివారణపై అవగాహన

**చిల్లకూరు :** క్షయ వ్యాధి సోకిన వారు తీసుకోవలసిన జాగ్రత్తలపై బాధితులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలో సోమవారం ఆ బైండింగ్ హోప్ ట్రస్టు నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ షరీనా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులకు ఇలాంటి సంస్థలు అండగా నిలబడి పౌష్టికాహారం అందిస్తున్నాయని చెప్పారు. అనంతరం పౌష్టికాహారం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ డాక్టర్ నిర్మల్‌కుమార్, డాక్టర్ రేష్మా, ఏఓ కమలకిరణ్,జయప్రకాష్, సురేంద్రరెడ్డి, ప్రియాంక, క్రాంతి కుమార్, శకుంతల, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.


ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న షరీనా, ట్రస్టు ప్రతినిధులు

## ఆయుర్వేదంతోనే ఆరోగ్యం


డాక్టర్ ఎస్.శంకరయ్య

**గూడూరురూరల్ :** మానవాళికి అసలైన ఆరోగ్యం అందించేది ఆయుర్వేదమని డాక్టర్ ఎస్.శంకరయ్య ఎండీ(ఆయుర్వేదం) తెలిపారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని నరసింగరావుపేట 4వ వీధిలో లక్ష్మీ శంకర్ ఆయుర్వేద హాస్పిటల్, కేరళీయ పంచకర్మ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా గూడూరు, పరిసర ప్రాంతాల ప్రజలకు సంపూర్ణ ఆయుర్వేద చికిత్సలు అందిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ మానవుడు జీవించినంత కాలం శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉండడమే ముఖ్యమన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన సోరియాసిస్, చర్మవ్యాధులు, కీళ్ల నొప్పులు, మోకాళ్ల నొప్పులు, సయాటికా, ఆయాసాల, సైనసైటిస్, గ్యాస్ట్రబుల్, కిడ్నీలో రాళ్లు, సంతాన సమస్యలు, మొలలు, పక్షవాతం వంటి సమస్యలు కేరళీయ పంచకర్మ చికిత్సల ద్వారా శాశ్వత పరిష్కారం అందిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 8008530835ను సంప్రదించాలని తెలిపారు.

## పొలాలకు వెళ్లే దారి లేదని ఫిర్యాదు

**కలువాయి(సైదాపురం):** మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామస్తులు పెన్నానది వెంబడి ఉన్న పొలాలకు వెళ్లడానికి కర్మక్రియలు చేయడానికి దారి లేకుండా అదే గ్రామానికి చెందిన శెట్టిపల్లి సురేష్ జేసీబీ సాయంతో భారీ గుంత తవ్వేశారని సోమవారం నెల్లూరు కలెక్టర్ హిమాంశు శుక్లాకు ఫిర్యాదు చేశారు. నేషనల్ హైవేపై కొత్త బ్రిడ్జి కట్టిన నేపథ్యంలో హైవే బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న పొలాల్లోకి ట్రాక్టర్ వెళ్లడానికి కూడా వీలు లేకుండా చేశారని చెప్పారు. దీనిపై వెంటనే చర్యలు చేపట్టాలని కలువాయి ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.


కలెక్టర్‌కు అర్జీ సమర్పించిన వెంకటరెడ్డిపల్లి గ్రామస్తులు

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

**నాయుడుపేటటౌన్ :** పట్టణంలో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, రామకృష్ణాపురం వీధికి చెందిన జునైద్ (22) చెడు వ్యసనాలకు బానిసై తరచూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేసేవాడు. ఆ క్రమంలో ఈ నెల 14వ తేదీ మద్యంలో గడ్డి మందు కలుపుకుని తాగాడు. యువకుడిని చెన్నై వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి మామ ఫక్రుద్దీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పంట కాలువ పనులు నిలిపివేత

సాక్షి ఎఫెక్ట్..

**దొరవారిసత్రం :** మండలంలోని ఆనేగొట్టం గ్రామ పరిధిలో పెద్ద చెరువు నుంచి వెళ్లే పంట కాలువ పనులకు చెందిన ఉపాధి కూలీల మస్టర్లను నిలిపివేసినట్లు స్థానిక ఏపీఓ ఉషారాణి సోమవారం తెలియజేశారు. ఆదివారం 'సాక్షి' దిన పత్రికలో 'రైతుల కష్టం స్వాహాకు యత్నం' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. ఆనేగొట్టం గ్రామంలో ప్రస్తుతం జరుగుతున్న కాలువ పనులను నిలిపివేయడంతో పాటు పనులు చేయిస్తున్న ఎఫ్ఏను మందలించినట్లు ఉపాధి అధికారులు తెలియజేశారు. మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఏపీఓ తెలిపారు.

## ఉద్యోగోన్నతి పొందిన ఎంపీడీఓకు సత్కారం


సత్కారం అందుకుంటున్న ఉమామహేశ్వరరావు

**వాకాడు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా పని చేస్తున్న ఉమామహేశ్వర రావు సోమవారం ఉద్యోగోన్నతిపై చిట్టమూరు ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఉమామహేశ్వరరావును ఘనంగా సత్కరించారు.

## పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన

**గూడూరురూరల్ :** పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.సుజన మాట్లాడుతూ పూర్వ ప్రాథమిక విద్య ఎంతో ప్రాముఖ్యమని తెలిపారు. మూడేళ్లలోపు పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు.

## రైతు బాధలు పట్టని కూటమి ప్రభుత్వం

**కోట:** యూరియా కోసం రైతులు ఎండలో గంటల తరబడి పడిగాపులు గాసిన సందర్భాలు గతంలో ఎపుడూ లేవని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఆయన విద్యానగర్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల కష్టాలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. జగనన్న పాలనలో ఆర్బీకేల ద్వారా రైతులకు కావాల్సిన అన్నిరకాల ఎరువులు, విత్తనాలు సమృద్ధిగా సరఫరా చేసినట్లు గుర్తుచేశారు. రైతుల కష్టానికి తగ్గట్టుగా గిట్టుబాటు ధర కల్పించి అన్నదాత కళ్లలో ఆనందం నింపిన నేత జగనన్న అన్నారు. నేడు రైతులు గగ్గోలు పెడుతున్నా ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేసి పేదలకు వైద్య విద్యను పూర్తిగా దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాక్రిష్టారెడ్డి, చిల్లకూరు వెంకురెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి

## మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ దారుణం

**చిల్లకూరు:** గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన మెడికల్ కళాశాలలను నడపలేని స్థితిలో కూటమి ప్రభుత్వం కొట్టు మిట్టాడుతూ ఆ కళాశాలల ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమని వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. సోమవారం తాడేపల్లిలోని ఏపీ శాసన మండలి వద్ద ప్లకార్డులు పెట్టుకుని మండలి సభ్యులు మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు గత ప్రభుత్వం మెడికల్ కళాశాలలు నిర్మించగా నేడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించి, పేదల చదువులను అటకెక్కిస్తుందని దుయ్యబట్టారు. నేటి కూటమి ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరిచి పేదలకు వైద్యవిద్యను అందించేందుకు ముందుకు వచ్చి యథాస్థితిలో వైద్య కళాశాలలను కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పేద విద్యార్థులతో కలిసి ఆందోళనలను తీవ్ర తరం చేస్తామని ఆయన తెలిపారు.


నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

## స్వస్థ్ నారీతో ఆరోగ్యం పదిలం

**కలువాయి(సైదాపురం):** స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌తో ఆడబిడ్డలకు ఆరోగ్యం పదిలం అని వైద్యాధికారి ఎం విజయలక్ష్మి తెలిపారు. స్వస్థ్‌నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తెలుగురాయపురంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీల ద్వారా గర్భవతులు, బాలింతలకు కౌమార బాలికలకు, వయో వృద్ధులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు.

**కొండాపురంలో స్వస్థ్ నారీ**

**వాకాడు:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయంలో వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది కలసి నిర్వహించారు. అనంతరం అంగనవాడీ సిబ్బంది పౌష్టికాహార పదార్థాల స్టాల్స్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

# యూరియా నిల్.. పంటలు డల్

- ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని పాలకులు

**పెళ్లకూరు:** కష్టపడి సేద్యం చేసే అన్నదాతలకు యూరియా అందుబాటులో లేకపోవడం వల్ల సాగు పనులు చేపడుతున్న ప్రారంభ దశలోనే ఆందోళన చెందుతున్నారు. యూరియా సంక్షోభంతో ఈ ఏడాది సాగు పనులు కష్టమేనంటూ పలువురు రైతులు దుక్కి పనులు కూడా చేపట్టకుండా పొలాలను బీడుగా వదిలేస్తున్నారు. మండలంలో ఏటా రబీ సీజన్‌లో 4,750 హెక్టార్లకు పైగా వరిసాగు చేస్తారు. ఈ ఏడాది కొన్ని ప్రాంతాల్లో మాత్రమే రైతులు దుక్కి పనులు మొదలుపెట్టారు. అయితే రాష్ట్రంలో యూరియా సంక్షోభాన్ని గ్రహించిన కొందరు రైతులు సాగు పనులు చేపట్టకుండా పొలాలను బీడుగా వదిలేస్తున్నారు. పచ్చిరొట్ట, ఎరువు లు, విత్తనాలను కూటమి ప్రభుత్వం సరైన సమయంలో అందించలేకపోవడంతో పలు ప్రాంతాల్లోని రైతులకు ఎదురు చూపులు తప్పడం లేదు. ముందస్తుగా కొందరు రైతులు పట్టణాలకు వెళ్లి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలపై యూరియా కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది యూరియా అందు బాటులో ఉండదేమో అనే సందేహంతో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు ఎరువుల కోసం శ్రీకాళహస్తి, నాయుడుపేట పట్టణాలకు పరుగులు తీస్తున్నారు.

**13 మెట్రిక్ టన్నులు అవసరం.. ఉన్నది మూడే**

ఏటా సాగుకు 13 మెట్రిక్ టన్నులకు పైగా యూరియా అవసరం ఉంది. కానీ కూటమి ప్రభుత్వంలో పాలకుల ఒత్తిళ్లతో వ్యవసాయ శాఖ ఉన్నతాధికారు ల సూచనల మేరకు ఇక్కడి మండల స్థాయి అధికారులు కేవలం మూడు మెట్రిక్ టన్నుల యూరి యా మాత్రమే కావాలంటూ అంచనాలు పంపారు. దీంతో ఈ యేడాది యూరియాకు కృత్రిమ డిమాండ్ సృష్టించి రైతులపై భారం మోపుతున్నారు. పెళ్ల కూరు, చెంబేడు, నెలబల్లి గ్రామాల్లో ఉన్న గోదాములతో పాటు చిల్లకూరు పీఏసీఎస్‌లో కూడా ఒక్క బస్తా యూరియా లేకపోవడం గమనార్హం.


పెళ్లకూరులో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ గోదాము

**కొరత లేకుండా చర్యలు**

వరిసాగు చేపట్టే రైతులకు ఎరువులు కొరత లేకుండా ముందుస్తూ చర్యలు చేపడుతున్నాం. యూరియా తక్కువ వాడకంతోపాటు నానో యూరియా వల్ల ప్రయోజనాలను వివరిస్తున్నాం. త్వరలోనే యూరియా రైతులకు అందించేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాము.

– విజయభారతి,
మండల వ్యవసాయశాఖ అధికారి, పెళ్లకూరు

## డీఈఈ మృతిపై విచారణకు డిమాండ్

**తిరుపతి కల్చరల్ :** వెంకటగిరి మున్సిపాలిటీలో డీఈఈగా పనిచేస్తున్న రాయపూడి శ్రీధర్ మృతిపై విచారణ చేపట్టాలని మాల యువసేన రాష్ట్ర అధ్యక్షుడు పొందుగల చైతన్య, దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు సి.వెంగళరావు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. వెంకటగిరిలోని అయ్యప్పగుడి వద్ద ఓ ఇంట్లో శ్రీధర్ ఒంటరిగా కాపురముంటున్నారని, అయితే గత నెల 20వ తేదీన తన అనుమానస్పదంగా మృతి చెందారన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు కూడా చేశారని, అయితే శ్రీధర్ భార్య సరళ మాత్రం గుండెపోటుతో తన భర్త మృతి చెందినట్లు తెలిపిందని ఆరోపించారు. సరళతో శ్రీధర్ సుమారు 16 నెలలుగా దూరంగా ఉన్నారని వివరించారు. మృతదేహంపై గాయాలు కూడా ఉన్నాయని, దీనిపై ఎస్పీ స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలని కోరారు. మృతుడి సోదరుడు రాయపూడి పూర్ణచంద్ర కళాధరరావు, దళిత నేతలు గోపి, హరికృష్ణ, రవిరాజు పాల్గొన్నారు.